
# చిన్ని చిన్ని ఆశ!



నిశాపతి

"అర్థం అయిందా? మళ్లీ ఒకసారి చెప్పమంటారా?" అన్నాడు కంప్యూటర్ ఇంజనీర్ డాక్టర్ విరించి. అతను ఆ శాస్త్రంలో ప్రపంచంలో మూడవవాడు.

ఆమె మాట్లాడకుండా తల వాల్చుకుని కూర్చుంది.

"ఇప్పుడు మీరు క్షణాల్లో నిర్ణయం తీసుకోవాలి. మీరు ఆలస్యం చేసే ప్రతి క్షణం మీ భర్తతో మీరు శేషజీవితం గడిపే అవకాశం పోగొట్టుకుంటారు!" అన్నాడు న్యూరో సర్జన్ డాక్టర్ శుక్లా. అతను ఆ రంగంలో ఆసియాలో రెండవవాడు.

ఆమె తలెత్తి చూసింది, ఏ భావమూ వ్యక్తంకాని మొహంతో.



పావుగంట క్రితం జరిగిన యాక్సిడెంట్‌లో ఆమె భర్త ప్రయాణం చేసే కారు ఓ బస్సును ఢీకొంది. అతని పుర్రె రెండుగా చీలి మెదడంతా బయటకు వచ్చేసింది. గుండె, నాడి కొట్టుకోవడం ఆగిపోయాయి. క్లినికల్ డెత్ సంభవించింది.

డాక్టర్ విరించి ఆమెకేసి చూసి, "ఇంకో ఐదు నిముషాల్లో మేం పని ప్రారంభించాలి. లక్కీగా స్కల్ ఎముకలు ఏమీ విరగలేదు కాబట్టి, మీ భర్త మెదడు స్థానంలో కంప్యూటర్ పెట్టి కుట్టేయవచ్చు. నిజానికి ఇలాంటి కంప్యూటర్ రెడీమేడ్‌గా ఉండటం మీ అదృష్టం. ఓ జపనీస్ కంపెనీ ఆర్డర్ మీద రోబోకోసం ఆ దేశం తీసుకువెళ్తున్నాను. మీ కోసం కాకపోయినా, శాస్త్ర పరిశోధనలకోసమైన మీ భర్తపై దీన్ని వినియోగించదల్చుకున్నాను. మీ భర్త శరీరం అంతా క్షేమంగా ఉంది. అతని శరీరానికి మా కంప్యూటర్ నుండి 'ఇమ్‌పల్సెస్' అందుతూంటాయి. అందువల్ల మీ భర్త చర్మం సజీవంగా ఉంటుంది."

"అఫ్‌కోర్స్, ఆరునెలలకోసారి నేను 'సెల్లో ప్లాస్మా'ని సబ్‌క్యుటేనియస్‌గా ట్రాన్స్‌ఫ్యూజ్ చేస్తూంటే" అంటూ అడ్డు తగిలాడు డాక్టర్ శుక్లా.

"అవును!" అన్నాడు డాక్టర్ విరించి అతనితో ఏకీభవిస్తూ.

"శరీర భాగాల చలనానికి నా కంప్యూటర్ ఇచ్చే ఇంపల్సెస్ సరిపోతాయి గానీ, స్కిన్ డికే కాకుండా ఉండాలంటే అది చాలా అవసరం ... వెల్, అలా పునరుజ్జీవనం చెందిన దేహంతో అతను మీతో జీవితం గడపగలుగుతాడు. అతని మొహం ఏమాత్రమూ దెబ్బతినలేదు గనుక మీకు సైకలాజికల్‌గా అతనితో గడుపుతున్నట్లే ఉంటుంది. అంతేకాదు, అతను మీతో మాట్లాడగలడు కూడా. అఫ్‌కోర్స్, ప్రీ రికార్డెడ్ మాటలు మాత్రమే. అతని కంఠస్వరం ఉన్న కాసెట్స్ ఏవైనా ఉంటే వాటితో ఈ మాటల్ని మిక్సింగ్ చేసి మేం ఒక ప్రోగ్రాం ఇవ్వగలం. ఇహ, అతని లోపలి అవయవాలతో అంటే గాస్ట్రియం, లివర్, కిడ్నీలు వగైరాలతో ఇప్పుడు అవసరం లేదు గనుక అవి ఫంక్షన్ చెయ్యకపోయినా, జస్ట్ డికే కాకుండా యథాతథంగా ఉండేందుకు కావలసిన కెమికల్ ట్రీట్‌మెంట్ ఇస్తాం. అతని చర్మం ఏమాత్రం స్పర్శజ్ఞానం కోల్పోకుండా ఉంటుంది. అతని శరీరంలో కదిలే అవయవాలు మాత్రం ఎలక్ట్రికల్ ఇంపల్సెస్ సహాయంతో కదులుతాయి. అంటే కాళ్లూ, చేతులూ, మెడ, జెనిటల్స్ మాత్రం కదులుతాయి కంప్యూటర్ కమాండ్స్‌కి అనుకూలంగా. ఇకపోతే కళ్లూ, పెదవులూ ... కళ్లు మీకు అవసరం అనిపించినప్పుడు ఆపరేట్ చేసుకోవచ్చు. కానీ పెదవులు మాత్రం అతను ప్రీ రికార్డెడ్ మాటలు ఉచ్ఛరించేటప్పుడు మాత్రమే కదిలేలా చేస్తాం ఆహారం తీసుకోవడంలాంటి అవసరాలు లేవు కాబట్టి. ఈజ్ ఇట్ ఓకే బై యూ?" అని ఆగాడు డాక్టర్ విరించి.

"షల్ వుయ్ మేక్ లవ్!" అంటే, "ష్యూర్!" అని వినిపించేది. అప్పుడు సావిత్రి సంబంధిత స్విచ్‌లు ఆన్ చేసేది. ఆ క్షణం భర్త స్పర్శ నిజం మనిషి స్పర్శలాగే ఉండేది. ఆ శాస్త్రజ్ఞులు స్కిన్‌ని ఎందుకు ప్రిజర్వ్ చేశారో అర్థం అయి అంత దిగుల్లోనూ వాళ్ల మేధపై ఆరాధనా భావం కలిగేది.

ఆమె ఏమీ మాట్లాడలేదు.

ఒక్క క్షణం ఆగి తిరిగి మొదలెట్టాడు డాక్టర్ విరించి, గొంతు సాధ్యమైనంత మృదువుగా మార్చి.

"అఫ్‌కోర్స్, మేం మీ 'మారిటల్ లైఫ్' గూర్చి కూడా ఆలోచించాం ... వైబ్రేటర్స్ ఇంప్లాంట్ చేసి... అంటే తెలుసుగా?"

ఆమె తల వంచుకుని కూర్చుంది. కానీ కుమిలి కుమిలి ఏడుస్తున్నట్లుగా ఆమె భుజాలు కదులుతున్నాయి.

"ఆల్‌రైట్! మీకు ఇష్టం లేకపోతే ఈ ప్రయత్నం వదిలేద్దాం!" అన్నాడు విరించి.

ఆమె కొంచెం కంగారుపడి, "లేదు లేదు! మీరు మీ పని కానివ్వండి. నేను అనుమతిస్తున్నాను!" అంది.

విరించి కొంచెం తటపటాయిస్తూ, "ఈ ఆపరేషన్‌కంతా సుమారు 20 లక్షలు కావచ్చు!" అన్నాడు.

"అది నా కొక లెక్కలో ఎమౌంట్ కాదు. ఆయన రాత్రింబవళ్లు కష్టపడి సంపాదించిన డబ్బు ఆయనకి గాక ఇంకెవరికి?" అంటూంటే మళ్లీ ఆమెను దుఃఖపు కెరటం ముంచేసింది.

"రిలాక్స్!" అన్నాడు డాక్టర్ శుక్లా. "ఇక మేం మా పని మొదలుపెట్టడానికి అనుమతి లభించినట్లేగా ... శరీరానికి 'సొమాటిక్ డెత్' సంభవించిన తర్వాత ఎవరం ఏమీ చెయ్యలేం!" అన్నాడు.

"ఊఁ, అలాగే!" అంది ఆమె.

"బై ది వే, మీ ఆయన పేరేమిటి?" అన్నాడు డాక్టర్ శుక్లా.

"మృత్యుంజయమూర్తి!" అన్నది ఆమె.

"వెరీ అప్రోప్రియేట్ నేమ్!" అన్నాడు డాక్టర్ విరించి.

"మరి మీ పేరు?"

"సావిత్రి!"

ఆ విధంగా ఒక సామాన్య ధనిక యువతి తన భర్త శవం తాలూకూ సజీవ శరీరంతో కాపురం చెయ్యడానికి నాందీ ప్రస్తావన జరిగింది.

000 000 000

సావిత్రి తల్లిదండ్రులకి ఇదంతా ఏదో 'విలయం'లా అనిపించింది. ఇలా చెయ్యడం శాస్త్ర సమ్మతమో కాదో, ఏం అరిష్టమో అని పండితుల్ని సంప్రదించారు.

"తయోరేకం పిప్పలం స్వాద్వత్తి అనశ్నన్నన్యో అభిచాకశీతి!" అని కదా ఉపనిషద్వాక్యం. ఇక్కడ మృత్యుంజయమూర్తి ద్రష్టగానూ ఉంటూ ఉన్నాడు, భోక్తగానూ ఉంటూ ఉన్నాడు గనుక అతను సజీవుడే!" అన్నారు కొందరు పండితులు.

"అన్నమయ కోశం, జ్ఞానమయకోశం, ఆనందమయకోశం కలిస్తేనే మనిషి. జీవన క్రియలేవీ జరగనివాడు సజీవుడెలా అవుతాడు? సావిత్రి అతనితో జీవించడం శాస్త్ర సమ్మతం కాదు!" అన్నారు మరికొందరు.

సావిత్రి మాత్రం తన నిర్ణయం తాను తీసేసుకుంది.

"మీరంతా కొట్టుకుని చావండి! నేను ఇలాగే ఉంటాను. వరల్డ్ సైన్స్ కాంగ్రెస్ వాళ్లు చేసిన సిఫార్సు మేరకు ప్రభుత్వం వారిచ్చిన అనుమతి పత్రం నా దగ్గరుంది!" అంది.

కొంతమంది ఆమెను అభినందించారు.

కొంతమంది ఇరుగు పొరుగులు ఎందుకైనా మంచిదని ఇళ్లు ఖాళీ చేశారు.

కొన్నాళ్లకి ఆ గొడవ సద్దుమణిగింది. కానీ సావిత్రి ఇంటికి వచ్చే బంధువులు, స్నేహితులు మాత్రం చాలావరకు రాకపోకలు మానేశారు.

ఒక్కోసారి సావిత్రికి ఎంతో దుఃఖం ముంచుకొచ్చేది.

ముఖ్యంగా "ఈ ప్రపంచంలో అందరిలా పిల్లా పాపలతో హాయిగా ఉండేందుకు మళ్లీ పెళ్లి చేసుకోమ్మా!" అని వాళ్ల అమ్మా, నాన్నా అన్నప్పుడు.

అయితే, ఆ దుఃఖం నుండి స్వాంతన పొందేందుకు ఆలంబన కూడా మళ్లీ భర్తే!

నిస్సహాయంగా అతని గుండెలమీద తలపెట్టి విలపించేది.

అప్పుడప్పుడూ తను భర్తలో గడిపిన మధురక్షణాలు గుర్తుకొచ్చేవి.

ఆర్తిగా అతని చేతులు పట్టుకుని నొక్కేది.

దానికీ, దీనికీ ఒకలాగే ఉండేది అతని స్పందన. 98.4 డిగ్రీల ఫారెన్ హీట్‌కి ఒక్క పాయింటు ఎక్కువగానీ, తక్కువగానీ లేకుండా నిర్గుణంగా, నిరామయంగా.

000 000 000

నాలుగు నెలలు గడిచాయి. సావిత్రి మూర్తి శరీరంతో జీవితం గడపడం కొంచెం కొంచెం నేర్చుకుంటున్నది. మూర్తి సహజంగా ముక్తసరి స్వభావం కలవాడూ, చాలా తక్కువ మాట్లాడేవాడూ కనుక, ఆమెకీ పరిస్థితి మరీ ఏమీ కొత్తగా అనిపించలేదు.

ఉదాహరణకి, డిన్నర్ తీసుకునేముందు, "రండి!" అనేది. దానికి జవాబుగా "వస్తున్నా!" అని వచ్చి తన కుర్చీలో కూర్చునేవాడు.

వండిన కూర తనకే బాగా నచ్చినప్పుడు ఒక స్విచ్ నొక్కి "ఎలా వుంది?" అని అడిగేది.

"బాగుంది!" అని సమాధానం వచ్చేది.

కూర నాశనం అయిపోయిందని తనకే తెలిసినప్పుడు మరో స్విచ్చి నొక్కి, "ఎలా వుంది?" అని అడిగేది.

"పరమ దరిద్రంగా ఉంది!" అని జవాబు.

ఎప్పుడో భర్తకి మరీ దగ్గరగా ఉండాలనిపించినప్పుడు అతన్ని కౌగలించుకుని పెదాల మీద ముద్దుపెట్టుకునేది.

"ఐ లవ్ యు!" అంటే, "ఐ టూ!" అని జవాబు వచ్చేది.

"షల్ వుయ్ మేక్ లవ్!" అంటే, "ష్యూర్!" అని వినిపించేది.

అప్పుడు సావిత్రి సంబంధిత స్విచ్‌లు ఆన్ చేసేది.

ఆ క్షణం భర్త స్పర్శ నిజం మనిషి స్పర్శలాగే ఉండేది. ఆ శాస్త్రజ్ఞులు స్కిన్‌ని ఎందుకు ప్రిజర్వ్ చేశారో అర్థం అయి అంత దిగుల్లోనూ వాళ్ల మేధపై ఆరాధనా భావం కలిగేది.

000

సావిత్రి ఒంటరి జీవితాన్ని గమనిస్తున్న వారిలో ఆ వీధిలోనే కాపురం ఉంటున్న ప్రసేన్ ఒకడు. ఆ గమనించడం కూడా మామూలుగా కాదు, 'ఒక' కన్నేసి.

సావిత్రి దగ్గర మామూలు ఆడవాళ్లదగ్గర పనికొచ్చే పద్ధతులేవీ పనికిరావని గ్రహించడానికి ప్రసేన్‌కి ఎంతోకాలం పట్టలేదు.

అతను సానుభూతి కార్డు ప్లే చెయ్యడానికి ప్రయత్నించాడు గానీ, అసలామె దుఃఖమే ఎన్నడూ ప్రదర్శించకపోవడం వల్ల అతనికి ఆ అవకాశమూ రాలేదు.


డబ్బు ద్వారా, బహుమతుల ద్వారా లోబరుచుకోడానికి ఆమె అతనికంటే ఆర్థికంగా ఎన్నో మెట్లు పై అంతస్తులో ఉంది.

అందుకే ఒకరోజు తెగించి ఇంట్లోకి జొరబడి ఆమెను గట్టిగా తన చేతుల్లో బంధించాడు వెనకనుంచి. ఆమె అతన్ని విదిలించుకుని పరుగెత్తుకుంటూ వెళ్లి మృత్యుంజయమూర్తి చేతుల్లో వాలిపోయింది.

ప్రసేన్ ఆ చేతులు లాగెయ్యాలని చూశాడు కానీ అవి సావిత్రిని మృత్యుంజయమూర్తి శరీరానికేసి మరింత బలంగా నొక్కడం మొదలెట్టాయి గానీ విడివడలేదు. ప్రసేన్ ఇంకా తీవ్రంగా ప్రయత్నించేసరికి ఆ చేతుల్లోనుంచి సన్నని షాక్ లాంటిది వచ్చింది. అతను అదిరిపడి ఒక చిన్న కేకపెట్టి వగర్చుకుంటూ బయటకు వచ్చేశాడు.

సావిత్రికి చాలాసేపు జరిగిందేమిటో అర్థం కాలేదు. అర్థం అయ్యాక జరిగిన సంఘటనలు నెమరువేసుకోవడం ప్రారంభించింది. తను ఎడ్జస్ట్ చేయకుండానే భర్త చేతులు అంత బలంగా తమంత తామే ఎలా చుట్టుకున్నాయో ఆమెకి అర్థం కాలేదు. ఒక్క క్షణం నిజంగా ఆమెకి భర్త రక్షణ లభించినట్లే అనిపించింది.

అప్రయత్నంగా ఆమె నిర్జీవమైన భర్త



పెదవులపై ముద్దు పెట్టుకుంది. ఆశ్చర్యం! మాట్లాడేటప్పుడు తప్ప కదలని అతని పెదవులు ప్రతిస్పందించినట్లు అనిపించింది.

సావిత్రికి ఒక్క క్షణం ఆశ్చర్యం, ఆనందం కలిగాయి. వాటితోపాటు కొంచెం భయమూ కలిగింది. భర్త ఆత్మలాంటిదేమైనా భర్త శరీరంలో ప్రవేశించిందేమోనని!

అదృష్టవశాత్తూ ఆ మర్నాడే డాక్టర్ విరించి రొటీన్ చెకప్ ఉంది. అతను రాగానే సావిత్రి తనకి కలిగిన వింత అనుభవం గురించి చెప్పింది.

డాక్టర్ విరించి నమ్మలేదు. అదంతా ఆమె భ్రమ అయి ఉంటుందని కొట్టిపారేశాడు.

కానీ సావిత్రి గట్టిగా పట్టుబట్టడం వల్ల అతను మృత్యుంజయమూర్తి స్కల్ ఓపెన్ చేసి చూశాడు. తను తయారుచేసిన సర్క్యూట్‌లోని అతి సన్నని వైర్లచుట్టూ ఏదో తెల్లని, మెత్తని పదార్థం పేరుకుని ఉండటం గమనించాడు.

కంప్యూటర్‌లో ఏదైనా లోపం ఏర్పడిందేమోనని అతనికి అనుమానం కలిగింది. వెంటనే ఆ పదార్థాన్ని చాకుతో గీరి లాబ్‌కి తీసుకెళ్లి పరీక్షలు చేశాడు, డాక్టర్ శుక్లా సాయంతో.

వాళ్ల ఆశ్చర్యానికి అంతు లేదు.

ఆ పదార్థంలో మెదడులో ఉండేలాంటి పదార్థమే ఉంది ... అంతే!

ఇక వాళ్లు వెనక్కి తిరిగి చూడలేదు.

మృత్యుంజయమూర్తికి అన్నిరకాల మానవ మానసిక స్పందనల్నీ కృత్రిమంగా కలగజేశారు. ఆనందం, కోపం, శృంగారం, భయం, జుగుప్స ... ఇలా ... వాళ్లు ఊహించగలిగిన అనుభూతలన్నింటినీ కృత్రిమంగా కంప్యూటర్ కమాండ్స్ ద్వారా మృత్యుంజయమూర్తి మస్తిష్కంలో ప్రవేశపెట్టారు.

స్కానింగ్ సహాయంతో లోపల జరిగే మార్పుల్ని గమనించడం ప్రారంభించారు.


రోజురోజుకీ అతని మెదడులో ఒక్కో పొరగా పదార్థం ఏర్పడటం గమనించారు.

మూడు సంవత్సరాల కాలంలో యంత్రం సహాయం అవసరం లేని మామూలు మనిషి అయ్యాడు మృత్యుంజయమూర్తి.

అయితే, అతను చాలా ప్రాథమికమైన అనుభూతులకు మాత్రమే స్పందించగలడు. అతి సున్నితమైన భావాలకి అతనిలో స్పందన ఉండదు.

మొత్తానికి సైన్స్ చరిత్రలో మనిషికి పునర్జన్మ ప్రసాదించిన తొలి ఘట్టంగా ఈ సంఘటన నమోదైంది. దీనికి కారణభూతులైన డాక్టర్ విరించి, డాక్టర్ శుక్లాలు నోబెల్ బహుమతి పంచుకున్నారు.

ఆ సందర్భంగా ఏర్పాటు చేసిన ఓ సన్మాన సభలో వాళ్లు ఒక 'పేపర్' ప్రెజెంట్ చేస్తూ మాట్లాడారు.




"మేము సాధించిన ఈ విజయం వెనుక ఉన్న మూల సూత్రం వివరిస్తే ఇది ఇంత సులభమా అని మీరు ఆశ్చర్యపోతారు.

మీకు చిన్న ఉదాహరణ ద్వారా వివరిస్తాం.

మన కారు స్టార్ట్ కాకపోతే ఏం చేస్తాం? తోస్తాం. అప్పుడు స్టార్ట్ అవుతుంది. దీని వెనకాల ఉన్న సూత్రం ఏమిటి? మామూలు పరిస్థితుల్లో కారులో ఉండే సెల్ఫ్ స్టార్టర్ వ్యవస్థ ఇంజన్‌లో ఇగ్నిషన్ కలగజేస్తే, ఆ శక్తి కారు చక్రాల్ని తిప్పడానికి వినియోగపడుతుంది.

మనం కారుని తోసినప్పుడు ఏమవుతుంది? సరిగ్గా దానికి వ్యతిరేకమైన దృగ్విషయం జరుగుతుంది. బండి చక్రాల కదలికలకి ఇంజన్ ఇగ్నిషన్ రగిలించబడి, తర్వాత 'మోషన్'కి కారణభూతమవుతుంది.

ఇక్కడ కూడా అదే సూత్రం వర్తిస్తుంది. మనిషి సజీవంగా ఉన్నప్పుడు అతని మెదడు ఏం చేస్తుంది? విభిన్నమైన అనుభూతులకు స్పందిస్తుంది. మెదడులో కలిగే ఆ స్పందనల్ని మెదడు అవయవాలకి సరఫరా చేస్తుంది. అదే రివర్స్‌లో జరిగితే ... సజీవమైన శరీర కణాల్లో కలిగే స్పందన మెదడులో ప్రతిస్పందనని కలగజేస్తుంది. మెదడులో చలనం ప్రారంభం అవుతుంది. అంటే, మరోవిధంగా చెప్పాలంటే మెదడు కొత్తగా సృష్టించబడుతుంది. అలా సృష్టించబడే మెదడు అల్లుకోవడానికి కావలసిన ఆలంబనగా మా కంప్యూటర్ పనిచేసింది!

స్థూలంగా మమ్మల్ని నడిపించిన సూత్రం ఇదే! ఇప్పుడు మేము చేసిన ఈ చిన్న ప్రయత్నం సృష్టికి ప్రతిసృష్టి చేయాలనే మానవుడి హిమాలయమంత తపనలో ఓ చిన్న రేణువు మాత్రమే! త్వరలోనే మా ప్రయోగాలకి సంపూర్ణ విజయం చేకూరి మనిషి మృత్యువుని శాశ్వతంగా జయించగలడని నమ్ముతున్నాం.

ఈ సందర్భంలో మృత్యుంజయమూర్తిగారి పేరు గిన్నిస్ బుక్కులోనూ, శ్రీమతి సావిత్రిగారి పేరు 'లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లోనూ ఎక్కాయి. వారికి మా అభినందనలు!

నిజానికి సావిత్రిగారి సహకారమే లేకపోతే ఈ పరిశోధన విజయవంతం అయ్యేది కాదు. వారికి మరొకమారు మా అభినందనలు!

ఇప్పుడు సావిత్రిగారు మాట్లాడతారు..."

సావిత్రి లేచి నిలబడింది.

"సెలయేరులా సాగిపోయే మా జీవితాల్ని ఆ యాక్సిడెంట్ ఓ మలుపు తిప్పి బురదనీటివైపు నెట్టింది. డాక్టర్ విరించి, డాక్టర్ శుక్లా వీళ్లిద్దరూ వాళ్ల విజ్ఞానంతో దానిచుట్టూ ఒక చక్కని కొలను నిర్మించారు. అయినా అది తేరుకుని కాస్త కాస్త తేటపడటానికి చాలాకాలం పట్టింది. ఇంతలో ఇంకో మార్పు ఈ శాస్త్రజ్ఞులు తమ మేధాశక్తితో సృష్టించారు. ఆ నిలవనీటికి మళ్లీ ప్రవాహ దశ కల్పించారు. కృత్రిమమైన పరికరాల సాయంతోనే వారు ఇంత సాధించగలిగినప్పుడు ఓ పరిపూర్ణ స్త్రీగా నేను మా వెనుకటి జీవితాన్ని సాధించలేనా? తప్పక సాధించగలను. నా మీద నాకు నమ్మకం ఉంది. ఆ రోజు త్వరలోనే వస్తుంది. ఆ రోజు మళ్లీ ఇటువంటి సభను ఏర్పాటు చేసి అందులో మావారితో మాట్లాడింపజేస్తాను. దానికి కావలసిన శక్తియుక్తులు నాకు లభించేలా మీ అందరూ మీ ఆశీర్వాదాలు నాకు అందజేయండి. సెలవు!" అంటూ ముగించింది.

దూరంగా ఎక్కడనుంచో "చిన్ని చిన్ని ఆశ ... చిన్నదాని ఆశ...!" అన్న పాట సన్నగా వినిపిస్తోంది.

(అంకితం : ఏదో ఒక రోజు ఈ 'చిన్ని చిన్ని ఆశ'ని నిజం చేయగల శాస్త్రవేత్తలకు)

■